

## నిమ్న ప్రజల అభ్యున్నతికి పూలే కృషి

**ప్రజాశక్తి - చింతలపూడి**

సావిత్రిబాయి పూలే నిమ్న ప్రజల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని, కులమతాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమిస్తూ ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన వ్యక్తి పూలే అని ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ బోదా అవినాష్ అన్నారు. చింతలపూడి పట్టణంలో శుక్రవారం టిడిపి ఆధ్వర్యంలో పూలే వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలేతో కలిసి 1848 జనవరి ఒకటో తేదీన పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ రైతు కార్యదర్శి కొత్తపూడి శేషగిరిరావు, టౌన్ కమిటీ ఉపాధ్యక్షుడు పొలిల రాయప్ప, రైతు నాయకులు రావేళ్ల హనుమంతరావు, ఎస్‌సి సెల్ టౌన్ ఉపాధ్యక్షులు సొంగ ఏసుపాదం, నాయకులు మోరం ఈశ్వర్, నియోజకవర్గ నాయకులు మారుమూడి థామస్, గంటా నాగభూషణం, యాకూబ్, మద్దా ఆనంద్, బోకూరి ఏసు పాల్గొన్నారు.

# పాలకులు మారితే సొమ్ము ఆపేస్తారా..!

**గోకులం షెడ్లు లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరం**

**నాలుగేళ్లయినా జమకాని షెడ్ల సొమ్ము**

**ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.12.86 కోట్లు వరకూ బకాయి**

**కోర్టును ఆశ్రయించిన పలువురు లబ్ధిదారులు**

ఉంగుటూరు మండలం గొల్లగూడెంలో గోకులం షెడ్

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

'నా పేరు దాసరి సతీష్. ఉంగుటూరు మండలం గొల్లగూడెం గ్రామం. గత ప్రభుత్వ హయాంలో నాకు పశువుల షెడ్డు యూనిట్‌ను గోకులం పథకంలో నిర్మించాను. రూ.లక్షా 80 వేలు రావాల్సి ఉంది. ఎన్ఆర్ఇజిఎస్ వాటా కింద రూ.వెయ్యి వేలు జమ చేశారు. మిగిలిన సొమ్ము ఇప్పటి వరకూ రాలేదు. నాలుగేళ్లవుతోంది. ఖర్చు పెట్టిన సొమ్ముకు వడ్డీ తడిసి మోపెడైంది. ఇప్పటికైనా ప్రభుత్వం గోకులం షెడ్ల బకాయిలు విడుదల చేసి రైతులను ఆదుకోవాలి.'

'నా పేరు తమ్మినేని శ్రీనివాసరావు. ఉంగుటూరు మండలం ఎ.గోకవరం. గత ప్రభుత్వ హయాంలో రూ.లక్షా 80 వేల యూనిట్‌లో మినీ గోకులం షెడ్ నిర్మించాను. ఇప్పటి వరకూ డబ్బు జమ కాలేదు. దీనిపై కోర్టును ఆశ్రయించాను. డబ్బు కోసం ఎదురు చూస్తున్నాం.'

పైన పేర్కొన్న సతీష్, శ్రీనివాసరావులే కాదు. గోకులం షెడ్లు నిర్మించుకున్న దాదాపు 2,500 మందికిపైగా పాడి రైతులు తమకు రావాల్సిన సొమ్ము కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. నేతలు మారితే ప్రభుత్వం ఇవ్వాల్సిన సొమ్ము ఆపేయడం ఏ విధంగా సమంజసం అంటూ పాడి రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. పశుపోషణను మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో గోకులం షెడ్ల నిర్మాణాలను చేపట్టారు. రెండు పశువులకు సంబంధించి షెడ్ల నిర్మాణం చేసుకునే రైతులకు రూ.లక్ష, నాలుగు పశువుల షెడ్డుకు రూ.లక్షా 50 వేలు, ఆరు పశువుల షెడ్డుకు రూ.లక్షా 80 వేలు చొప్పున ఇచ్చేవిధంగా గోకులం షెడ్ల నిర్మాణ పథకం ప్రవేశపెట్టింది. షెడ్ల నిర్మాణం కోసం 2,728 మంది పాడి రైతులు దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం రూ.42.79 కోట్లు వరకూ అంచనా వేసి అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ప్రభుత్వం మారేసరికి ఆన్‌లైన్‌లో ఎఫ్‌టిఒ జనరేట్ అయిన లెక్కల ప్రకారం రైతులకు రూ.14.13 కోట్లు వరకూ రావాల్సి ఉంది. దీనిలో లేబర్ ఖర్చుల కింద రూ.కోటి 27 లక్షల వరకూ రావాల్సి ఉండగా, మెటీరియల్ ఖర్చు కింద రూ.12.86 కోట్లు రైతులకు అందాల్సి ఉంది. ఎన్ఆర్ఇజిఎస్ కింద లేబర్ ఖర్చు కింద ఇవ్వాల్సిన సొమ్ము కొంతమేర వచ్చాయి. మెటీరియల్ ఖర్చుల కింద రావాల్సిన నిధులు రూ.12.86 కోట్లు మాత్రం రైతులకు అందలేదు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత మినీగోకులం సైట్ నిలిపివేయడంతో ఎఫ్‌టిఒ జనరేట్ కాని సొమ్ము దాదాపు రూ.28.65 కోట్లు వరకూ ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. దీనిలో లేబర్ ఖర్చుల కింద ఇచ్చేది రూ.కోటి 93 లక్షల వరకూ ఉండగా, మెటీరియల్ ఖర్చు కింద రూ.26.72 కోట్లు వరకూ ఉంది. ప్రభుత్వం గోకులం షెడ్ల బిల్లులు నిలిపివేయడంతో అప్పులు తెచ్చి షెడ్లు నిర్మించిన రైతు పరిస్థితి అయోమయంగా మారింది. దీనిపై కొంతమంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా సొమ్ము జమ చేస్తున్నట్లు తెలుస్తోంది. కోర్టుకు వెళ్లలేని రైతుల పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు. రాజకీయ బకాయి లెక్కలు చూస్తే గోకులం షెడ్ల విషయంలో రైతులు పెద్దఎత్తున నష్టపోయినట్లు స్పష్టమవుతోంది. ప్రభుత్వం చెప్పినట్లు షెడ్ల నిర్మించుకోవడం తాము చేసిన తప్పా అంటూ పాడి రైతులు లబోదిబోమంటున్నారు. గోకులం షెడ్ల పెండింగ్ బిల్లులు విడుదల చేసి తమను ఆదుకోవాలని కోరుతున్నారు. కోర్టుకు వెళ్లిన వారికి మాత్రమే జమ చేస్తూ.. లేక నిర్మాణం చేసుకున్న రైతులందరికీ బకాయిలు చెల్లిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. కోర్టుకు వెళ్లిన రైతులకు సొమ్ము జమవుతున్నట్లు పశుసంవర్థక శాఖ అధికారులు చెబుతున్నారు.

**మినీ గోకులం షెడ్ల బిల్లుల బకాయిలు వెంటనే చెల్లించాలి**

**కె.శ్రీనివాస్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి**

రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు మినీగోకులం షెడ్ల బిల్లులు చెల్లించకపోవడం అన్యాయం. మూడేళ్లుగా పశు సంవర్థక కార్యాలయాల చుట్టూ పాడి రైతులు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ప్రభుత్వం వైపు నుంచి సరైన స్పందన లేకపోవడం దారుణం. అప్పు చేసి రైతులు గోకులం షెడ్ల నిర్మాణం చేశారు. అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం గోకులం షెడ్డు బిల్లులు వెంటనే చెల్లించాలి.

చేతులకు సంకెళ్లతో వినూత్నంగా నిరసన తెలుపుతున్న నాయకులు

## సిపిఎస్ రద్దు వరకూ పోరాటం : వామపక్షాలు

**ప్రజాశక్తి - ఏలూరు**

ఉపాధ్యాయుల, ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాన్ని ఆపాలని, సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. శుక్రవారం సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఏలూరు పాతబస్టాండ్ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్ష నాయకులు చేతికి సంకెళ్లు కట్టుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. అనంతరం ధర్నా నిర్వహించారు. సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పళ్లెం కిషోర్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నానుద్దేశించి సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు (యువి), సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ గత ఎన్నికల ముందు ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని అడుగుతున్న ఉపాధ్యాయుల పై, ఉద్యోగులపై నిర్బంధాన్ని ప్రయోగిస్తుందని విమర్శించారు. రకరకాల యాప్‌ల పేరుతో ఉపాధ్యాయులపై ఒత్తిడి చేస్తోందన్నారు. బైజూస్ సంస్థకు సేవ చేయాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి సరికాదన్నారు. ఈ ఒత్తిడి వల్ల ఇటీవల రాష్ట్రంలో ఐదుగురు ఉపాధ్యాయులు మృతిచెందారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉపాధ్యాయ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయని ఈ ఎన్నికల్లో ఓడిపోతామని భయంతో ఉపాధ్యాయులను, ఉద్యోగులను వేధింపులకు పాల్పడుతుందని విమర్శించారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ప్రచారం చేసుకుని ఓటు వేసుకునే హక్కు ఉద్యోగులకు ఉపాధ్యాయులకు ఉందని ఇది రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఉపాధ్యాయులపై, ఉద్యోగులపై నిర్బంధ విధానాలు వీడాలని హెచ్చరించారు. ప్రతినెల ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డేగా ప్రభాకర్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు కాకర్ల అప్పారావు నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కె.శ్రీనివాస్, పి.వి.రామకృష్ణ, ఇతర నాయకులు కె.విజయలక్ష్మి, పి.ఆదిశేషు, సోమయ్య, జగన్నాథరావు సిపిఐ నాయకులు ఉప్పులూరు హేమశంకర్, పి.కన్నబాబు, మాతూరి విజయ, తెల్ల శ్రీను, ప్రసాద్, ఎమిడి హకీమ్, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు నూకరాజు, మంగం అప్పారావు నాగేశ్వరరావు, దుర్గారావు పాల్గొన్నారు.

## కార్మిక, కర్షక హక్కులను హరిస్తున్న బిజెపి

**ప్రజాశక్తి - ఉంగుటూరు**

దేశంలోని కార్మిక - కర్షకుల హక్కులను కాలరాయడంలో కేంద్రప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తుందని వివిధ ప్రజాసంఘాల నాయకులు విమర్శించారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కల్యాణ మండపంలో సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సిఐటియు మండల అధ్యక్షులు సీరా అప్పారావు అధ్యక్షత వహించారు. అనంతరం వచ్చేనెల ఐదో తేదీన జరిగే చలోఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ కార్మికవర్గం పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించి కార్మికులను బానిసలుగా మార్చే కుట్ర జరుగుతుందన్నారు. దేశ ప్రజలందరి ఉమ్మడి ఆస్తులను బడా కార్పొరేట్, పెట్టుబడిదారులకు కారుచౌకగా కట్టబెడుతుందన్నారు. సామాన్యులపై మోయలేని పన్నుల భారం మోపుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు గిట్టుబాటు ధర లేకుండా చేస్తున్నాయన్నారు. అనంతరం ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి కొక్కిరపాటి వెంకట్రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోండ్రు చినఅంజయ్య, పసుపులేటి వెంకటేశ్వరరావు, భోగా అనంతలక్ష్మి, టేకి శ్రీనివాసరావు, ఆర్.అరుణకుమారి, ఏలూరి పెంటమ్మ పాల్గొన్నారు.

## ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

**ఏలూరు టౌన్:** స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ సిబ్బందికి శుక్రవారం ఏలూరు ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన శిక్షణా తరగతులను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పరిశీలించారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని ప్రారంభించే సమయంలో బ్యాలెట్ బాక్స్‌ల సీళ్లను అధికారులు, ఏజెంట్ల సమక్షంలో తీయాలని, సీళ్లు తీసే ప్రక్రియను వీడియో కవరేజ్ చేయాలనీ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఓట్లు చెల్లుబాటు ఏ విధంగా పరిశీలించాలనే విషయంపై ఎన్నికల సంఘం జారీచేసిన నిబంధనలను శిక్షణా తరగతుల్లో అధికారులు తెలియజేస్తారని, శిక్షణా తరగతుల్లో తెలిపిన ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఓట్ల లెక్కింపు విధులను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఓట్ల లెక్కింపునకు ఏర్పాటు చేసిన టేబుళ్లు, బారికేడ్ల ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్లను అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట జెసి, రిటర్నింగ్ అధికారి పి.అరుణ్‌బాబు, జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, డ్వామా పీడీ రాంబాబు, సంక్షేమ సంక్షేమ శాఖ జెడి మధుసూదనరావు పాల్గొన్నారు.

## అల్లంచర్ల అటవీ భూముల్లో హై అలెర్ట్

**టి.నరసాపురం:** మండలంలోని అల్లంచర్ల అటవీ భూముల్లో పోలీసులు హైఅలెర్ట్ ప్రకటించారు. ఆ మేరకు శుక్రవారం అల్లంచర్లరాజుపాలెం పంచాయతీలోని కొత్తగూడెం పురవీధుల్లో పోలీసులు, అటవీ సిబ్బందితో కవాతు నిర్వహించారు. 226 సర్వే నెంబర్‌లోని భూముల్లో కొందరు ఆక్రమణలకు పాల్పడుతున్నారనే కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ముందస్తుగా ఆయా గ్రామాల్లో పోలీసులు, ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్‌వికె.కుమార్ మాట్లాడుతూ అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అటవీ భూముల్లో ఫారెస్ట్ బ్లాక్ నోటిఫికేషన్ చేసిన తరువాత సెక్షన్ నాలుగు, ఆరు ప్రకారం ఎవరైనా అటవీ భూములు ఆక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం అటవీ భూములు ఆక్రమణకు గురికాలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ కె.సతీష్ కుమార్, పోలీసు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

## మోటార్లకు మీటర్ల ఏర్పాటుతో ప్రయోజనం శూన్యం

**వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను యథావిధిగా కొనసాగించాలి**

**తెల్ల దోమ నివారణకు సామూహిక నిర్మూలన కార్యక్రమం చేపట్టాలి**

**ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్**

**ప్రజాశక్తి - ద్వారకాతిరుమల**

వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించడం వల్ల ప్రయోజనం ఏమీ లేదని, శ్రీకాకుళం జిల్లాలో పైలట్ ప్రాజెక్టు అధ్యయనం చేసిన ప్రయాస్ ఎనర్జీ గ్రూప్ నివేదిక తేల్చిచెప్పిన నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం వ్యవసాయ మోటార్లకు మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎం.నాగులపల్లిసెంటర్ పాలకేంద్రం ఆవరణలో రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల మండల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి రైతుసంఘం మండల అధ్యక్షులు బోయపాటి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. మండలంలోని పలు రైతాంగ సమస్యలు చర్చించి తీర్మానాలు ఆమోదించారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాస్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ ఆదా అవ్వకపోగా ప్రజాధనం వథా అవుతోందని ప్రయాస్ రిపోర్టు పేర్కొందన్నారు. పూర్తి నివేదికను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా వెల్లడించాలని కోరారు. వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉద్యాన పంటలకు తెల్ల దోమ ఆశించి తీవ్ర నష్టం జరుగుతుందని తెల్ల దోమ నివారణకు సామూహిక నిర్మూలన చర్యలు చేపట్టాలని కోరారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు మాట్లాడుతూ తాడిపూడి ఎత్తిపోతల పథకం కాలువ పనులు పూర్తి చేయకుండా వదిలేయడం తగదన్నారు. తాడిపూడి ఎత్తిపోతల పథకం కాలువ పనులు పూర్తిచేసి మండలంలోని రైతులకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. దొండ పందిళ్ల సబ్సిడీ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తూంపాటి మురళీ, యలమర్తి రాంబాబు, పడమట పుల్లంరాజు, తూంపాటి శ్రీనివాసరావు, పోలుకొండ నాగరాజు పాల్గొన్నారు.

## దోమలతోనే ప్రాణాంతక వ్యాధులు

**నిర్మూలనలో ప్రజలు భాగస్వాములు కావాలి**

**డిఎంహెచ్ఒ డి.ఆశ**

**ప్రజాశక్తి - ఏలూరు టౌన్**

దోమల నిర్మూలనలో ప్రజలు భాగస్వాములు కావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.ఆశ సూచించారు. ఫ్రైడే - డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఏలూరు అర్బన్‌హెల్త్ సెంటర్ కొత్తపేట, పంపులచెరువు సెంటర్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమకాటు చాలా ప్రమాదకరమన్నారు. దోమ కుట్టడం వల్ల డెంగీ, మలేరియా, చికున్ గునియా వంటి ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తాయన్నారు. దోమల నిర్మూలన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. దీనికి పరిసరాల పరిశుభ్రత పాటించడమే ఉత్తమమని సూచించారు. డెంగీ, మలేరియా కారక దోమలు మన గృహాల్లో, ఆరుబయట ఉండే మంచినీళ్ల తొట్టెలు, డ్రమ్ములు, పూల కుండీలు, ఫ్లవర్ వాజులు, రుబ్బురోలు, ఫ్రిడ్జ్ వెనుక బాక్స్, ఎయిర్ కూలర్స్, పాత టైర్లు, వాడేసిన కొబ్బరిబొండాలు, ప్లాస్టిక్ వస్తువులు, నీటి నిల్వ ప్రాంతంలో ఆవాసాలు ఏర్పరచుకుంటాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలు వారానికి ఒకసారి నీటి నిల్వ ప్రాంతాలను పరిశుభ్రపరుచుకుని ఆరబెట్టుకోవాలన్నారు. పనికిరాని వస్తువులు తొలగించాలని సూచించారు. జిల్లా మలేరియా నివారణ అధికారి పిఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచంలో దోమల వల్ల డెంగీ, మలేరియా, ఇతర ప్రాణాంతకవ్యాధులుతో బాధపడుతున్నారని తెలిపారు. దీనివల్ల అనేక మంది చనిపోతున్నారని, దోమ చిన్న కీటకమైనప్పటికీ దానిద్వారా వచ్చే ముప్పు చాలా ప్రమాదకరమని చెప్పారు. దోమతెరలు వాడాలని, కిటికీలు మూసి ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యుపిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రోహిత్, అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, హెల్త్ ఎంపిహెచ్ఇఒ రవికుమార్, ఎంపిహెచ్ఎస్ కృష్ణ, అసిస్టెంట్స్ రమేష్, శ్రీనివాస్, ఎఎన్ఎంలు దుర్గ, వెంకటలక్ష్మి, రమాదేవి ఆశా కార్యకర్తలు పి.దేవి, సిహెచ్.దేవి, సుమలత, అనురాధ, మణి, శివపార్వతి వాలంటీర్లు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద బాధితులకు సిపిఎం చేయూత

**27 కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేత**

**ప్రజాశక్తి - వేలేరుపాడు/కుక్కునూరు**

అగ్నిప్రమాదంలో ఇళ్లు కాలిపోయి రోడ్డునపడ్డ కన్నాయిగుట్ట అగ్నిప్రమాద బాధితులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కన్నాయిగుట్ట గ్రామస్తులకు సిపిఎం మండల కమిటీ చేయూతనందించింది. శుక్రవారం 27 కుటుంబాలకు రెండు క్వింటాళ్ల బియ్యం 50 కేజీల ఉల్లిపాయలు, పంచదార, కందిపప్పు, టీ పొడి ప్యాకెట్లు పంపిణీ చేశారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రవి మాట్లాడుతూ అగ్ని ప్రమాదానికి గురై సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన 27 గిరిజన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ప్రతీ కుటుంబానికి రెండు రూ.లక్షల నష్టపరిహారం, తాత్కాలికంగా ఉండేందుకు అవసరమైన ఇల్లు నిర్మాణానికి అయ్యే ఖర్చు, బియ్యం ఇతర నిత్యావసర సరుకులను ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి ధర్మాల రమేష్ మాట్లాడుతూ ప్రతి ఏటా వేసవిలో ఏదో ఒకచోట ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని, కట్టుబట్టలతో ఎంతోమంది రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో ఫైర్ ఇంజిన్ కూడా లేకపోవడం ప్రమాద తీవ్రతను మరింత పెరిగిందన్నారు. మండలంలో జరిగే ప్రమాదాలకు ఫైర్ ఇంజన్ రావాలంటే పక్కమండలంలోని కుక్కునూరు నుంచి రావాల్సి ఉంటుందని, సుమారు 25 కిలోమీటర్ల దూరం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి మండల కేంద్రంలో ఫైర్ ఇంజిన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. సిపిఎం జిల్లా నాయకులు మడివి దుర్గారావు మాట్లాడుతూ అగ్ని ప్రమాద బాధితులను ఇప్పటివరకూ ప్రభుత్వం పట్టించుకోలేదని, సర్వసం కోల్పోయి నిరాశ్రయులైన బాధితులను ప్రభుత్వం వెంటనే అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మడకం ఏసుబాబు, కొత్త వెంకటేశ్వర్లు, గుమ్మల వెంకట నంరసయ్య పాల్గొన్నారు.

కూలిపోయిన ఇళ్లను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

## ఐసిడిఎస్ సిడిపిఒగా నూరాని

**ప్రజాశక్తి - నూజివీడు**

నూజివీడు ఐసిడిఎస్ సిడిపిఒగా ఎస్‌వై నూరాని శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా మంగళగిరి నుండి బదిలీపై వచ్చిన ఆమె నూజివీడు ప్రాజెక్టు సమాచారాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్ల అభివృద్ధి, చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీపై తగిన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. సమాజంలోని పలురకాలైన రుగ్మతలపై ప్రజల్లో అవగాహన పెంపొందిస్తామన్నారు. ఆత్మహత్యల ప్రేరేపణ, బాల్యవివాహాలు, బాలికలు, మహిళల వేధింపులపై అవగాహన కల్పించడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. అంగన్‌వాడీ సెంటర్లకు హాజరయ్యే చిన్నారులకు పరిపుష్టి ఆహారం అందించడంతో, ఆరోగ్యవంతులుగా ఎదగగలరని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఉండాలన్నారు.

## ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలి

**ప్రజాశక్తి - ఏలూరు**

జిల్లాలో ఈనెల 13వ తేదీన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం మార్గదర్శక సూత్రాల ప్రకారం పోటీలో ఉన్న ఎవరైనా అభ్యర్థులుగానీ వారి తరపు వ్యక్తులుగానీ ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలు జారీ చేయాల్సి వస్తే అందుకు సంబంధించిన ప్రకటనలు మీడియా సర్టిఫికేషన్ మోనటరింగ్ కమిటీకి అందజేసి ముందస్తు అనుమతి పొందాల్సి ఉంటుందని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్.భవాని తెలిపారు. అలాగే పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజున ప్రింట్ మీడియాలో ప్రకటనలు ప్రచురించే ముందు ధృవీకరణ తప్పనిసరిగా పొందాలన్నారు. ముందస్తు అనుమతి కోసం ఏలూరు కలెక్టరేట్‌లోని ఎలక్షన్ సెల్‌లో ఏర్పాటు చేసిన ఎంసిఎంసి కమిటీని లేదా జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో గానీ సంప్రదించాలని సూచించారు.

## వార్షిక రుణ లక్ష్యం నూరుశాతం సాధించాలి : కలెక్టర్

**ప్రజాశక్తి - ఏలూరు**



బ్యాంకర్లతో సమీక్షిస్తున్న కలెక్టర్

జిల్లా వార్షిక రుణ ప్రణాళికలో ప్రాధాన్యత రంగాలకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ బ్యాంకర్లను ఆదేశించారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని గౌతమి సమావేశపు హాలులో శుక్రవారం జరిగిన బ్యాంకర్ల జిల్లా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లా రుణ ప్రణాళికలో రుణ లక్ష్యం రూ.12, వేల 807 కోట్ల రుణ లక్ష్యానికి గాను ప్రాధాన్యతరంగాలకు నిర్దేశించిన రూ.10,257 కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు 2550 కోట్ల రూపాయలు రుణాల మంజూరు లక్ష్యంగా నిర్దేశించారన్నారు. రైతాంగానికి స్వల్పకాలిక వ్యవసాయ రుణాల కింద 5,423 కోట్ల రూపాయలకు గాను, 4,514 కోట్ల రూపాయలు 83 శాతం మేర రుణాల మంజూరు చేశామని, 8,992 మంది కౌలు రైతులకు రూ.52.24 కోట్లు అందించామన్నారు. నూరు శాతం లక్ష్యాలను ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని బ్యాంకర్లను కలెక్టర్ కోరారు. స్వల్ప, మధ్యతరహా పరిశ్రమలకు రూ.2050 కోట్లు, ఇతర ప్రాధాన్యతా రంగాలకు రూ.800 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాల కార్యక్రమంలో భాగంగా పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో పేదలకు 87 వేల ఇళ్లను నిర్మిస్తున్నారన్నారు. వీరిలో డ్వాక్రా సభ్యులకు ఇళ్ల నిర్మాణానికి కొత్తగా గ్రూపులో చేరిన సభ్యులకు అదనపు రుణంగా రూ.35 వేలు మంజూరు చేయాలనీ కోరారు. డ్వాక్రా సంఘాలకు రుణాల మంజూరులో ఏడు రకాలైన పలు ఛార్జీలను వసూలు చేస్తున్నారని, వాటిని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారంటీ పథకంలో దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరు చేయకుండా బ్యాంకర్లు నిలిపివేసిన దరఖాస్తులపై సహేతుకమైన కారణాలను తెలియజేయాలని, వీటిని జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక మండలి సమావేశంలో సమీక్షించడం జరుగుతుందన్నారు. ఈ జిల్లా ఆక్వా కల్చర్‌కు ఎంతో అనువైన ప్రాంతమని, ఆక్వాకల్చర్ మరింత అభివృద్ధికి ఫిష్ ఆంధ్రా యూనిట్ల ఏర్పాటుకు నిరుద్యోగ యువతకు రుణాలు అందించి జిల్లాలో ఆక్వా పరిశ్రమ అభివృద్ధికి బ్యాంకర్లు తోడ్పడాలన్నారు.

కార్పొరేట్ సామజిక బాధ్యత కింద బ్యాంకర్లు వారి నికర లాభం నుండి రెండు శాతం నిధులు ప్రజల సామాజిక అవసరాల కోసం ఖర్చు చేయాల్సి ఉందని, ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బ్యాంకర్లను కోరారు. ఈ సమావేశంలో యూనియన్ బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.గోపాలకృష్ణమూర్తి, ఆర్‌బిఐ ప్రతినిధి నాగప్రవీణ్, నాబార్డ్ డిడిఎం టి.అనిల్ కాంత్, జిల్లా పంచాయతీ అధికారి, మత్స్య శాఖ ఇన్‌ఛార్జి జాయింట్ డైరెక్టర్ మల్లికార్జునరావు, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, వ్యవసాయశాఖ జెడి వై.రామకృష్ణ, జిల్లా పరిశ్రమల అధికారి ఏసు దాసు, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ ఎస్ఎస్ఎ.వెంకటేశ్వరరావు, వివిధ బ్యాంకుల జిల్లా కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

**పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు**

**పటిష్టంగా 'విజయకేతనం' అమలు**

**రామన్నగూడెం జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రమేష్‌బాబు**

**ప్రజాశక్తి - ద్వారకాతిరుమల**



పదో తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని మండలంలోని రామన్నగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు యు.రమేష్ బాబు తెలిపారు. పదో తరగతి పరీక్షలకు విద్యార్థులకు ఇస్తున్న శిక్షణ, ఉత్తీర్ణతకు సంబంధించి పలు విషయాలను ఆయన ప్రజాశక్తికి తెలిపారు. తమ పాఠశాల నుండి ఈ ఏడాది పరీక్షలకు 33 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. వారికి సబ్జెక్టుల వారీగా ఉదయం 8.30 గంటల నుండి సాయంత్రం 4.45 గంటల వరకూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా విద్యాశాఖ చేపట్టిన 'విజయకేతనం' 40 రోజుల ప్రత్యేక శిక్షణను పటిష్టంగా అమలుపరుస్తున్నామని తెలిపారు. ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు పరీక్షల్లో తీసుకోవాల్సిన మెళకువలపై విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారని వివరించారు.

## డ్రెయినేజీ నిర్మాణానికి చర్యలు

### ప్రజాశక్తి కథనానికి స్పందన

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

మండలంలోని పెయ్యేరు బిసి కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద నుంచి కోసూరి రమణరావు ఇంటివరకు సిసి డ్రెయినేజీ నిర్మాణానికి అంచనాలు చేశామని గ్రామ పంచాయతీ కార్యదర్శి యార్లగడ్డ శ్యామ్‌సుందర్ తెలిపారు. పెయ్యేరు బిసి కాలనీలో మురుగునీటితో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ముందుకు పారని మురుగు శీర్షికతో ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. గ్రామ సర్పంచి అల్లు సుశీల సూచన మేరకు సిసి డ్రెయినేజీ నిర్మాణానికి అంచనాలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు ఇంజినీరింగ్ అధికారులను కోరామని తెలిపారు.

## 20న విజయవాడలో ధర్నా

**ప్రజాశక్తి - నూజివీడు**

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20వ తేదీ విజయవాడ అలంకార్ సెంటర్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి మిడ్డే మీల్స్ కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం నూజివీడు సిఐటియు కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పిరష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.రాజు, నాగమణి పాల్గొన్నారు.

**ముసునూరు :** ఈ నెల 20వ తేదీన విజయవాడలో నిర్వహించే ధర్నాలో మండలంలోని 16 గ్రామాల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు జి.రాజు పిలుపునిచ్చారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని, మోనూ ఛార్జిలు రూ.20 ఇవ్వాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని పలు డిమాండ్లతో విజయవాడ అలంకార్ సెంటర్ వద్ద ధర్నా చేయనున్నట్లు తెలిపారు.

## బాధితులకు సత్యసాయి సేవా సంస్థ సాయం

**ప్రజాశక్తి - వేలేరుపాడు**

మండలంలోని కన్నాయిగుట్ట గ్రామంలో అగ్ని ప్రమాదంలో సర్వసం కోల్పోయిన బాధితులకు సత్యసాయి సేవా సంస్థ సాయం అందించింది. 27 కుటుంబాలకు వంటపాత్రలు, ట్రంకుపెట్టెలు, బియ్యం డ్రమ్ములు, నూతన దుస్తులు, దుప్పట్లు అందించారు. ఒక్కో కుటుంబానికి రూ.మూడు వేల విలువైన సామగ్రిని సంస్థ సభ్యులు శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు కె.శేఖరరావు, వెంకటేశ్వరరావు, జిల్లా సేవాదళ్ కన్వీనర్ ఎంవిఎన్.ధర్మారావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ కో-ఆర్డినేటర్ నర్రా రాంబాబు, జంగారెడ్డి గూడెం సబ్ జోన్ కన్వీనర్ పి.మూర్తి, సత్యసాయి సేవా సంస్థల ఏజెన్సీ ప్రతినిధి, కె.వెంకటేశ్వరరావు, ఎం.వెంకటసుబ్బారావు, ఎర్రంపేట సేవా సమితి పాల్గొన్నారు.

## తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

**ప్రజాశక్తి - ఏలూరు**

ఏలూరు ప్రభుత్వ బోధనా ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో తొమ్మిది మంది తలసేమియా చిన్నారులకు శుక్రవారం రక్తమార్పిడి నిర్వహించినట్లు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి తలసేమియా చిన్నారులను ఆదుకోవాలని కోరారు. తలసేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులకు 30 మందికి ఉచిత భోజనం ఏర్పాటు చేసిన వైభవ్ జ్యువెలరీస్ అధినేత గ్రంధి వెంకటఅమరేంద్రకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె.వరప్రసాదరావు, ట్రెజరర్ రేవూరి శివప్రసాద్, గ్రంధి అంబిక, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు బంగారు నాణెం బహూకరణ

**ప్రజాశక్తి - నూజివీడు రూరల్**

మండలంలోని బోరవంచ గ్రామానికి చెందిన పాడి రైతు ఎం.శ్రీనివాసరావు కుమారుడి వివాహం సందర్భంగా కృష్ణ మిల్క్ యూనియన్ వారు బంగారు నాణెం బహుమతిగా అందించారు. కృష్ణ మిల్క్ యూనియన్ బోర్డు డైరెక్టర్ పి.కొండలరావు, యూనియన్ మేనేజర్ చేతుల మీదుగా రూ.20 వేల విలువైన నాణెం నూతన వధూవరులుకు శుక్రవారం అందించారు.

## తుమ్మగూడెంలో రీసర్వే

**ప్రజాశక్తి - చాట్రాయి**

మండలంలోని తుమ్మగూడెం గ్రామంలో డ్రోన్ ద్వారా భూముల రీ సర్వే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సిహెచ్.విశ్వనాధరావు మాట్లాడుతూ అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా భూముల రీ సర్వే వేగవంతంగా పూర్తి చేయనున్నట్లు చెప్పారు. మండలంలో భూముల రీ సర్వే త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు కంచర్ల వెంకయ్య, మొలుగుమాటి ఇశ్రాయేలు, పిఎసిఎస్ అధ్యక్షుడు నరసింహరావు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం

**ప్రజాశక్తి - టి.నరసాపురం**

నులిపురుగు నివారణతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని మండల అభివృద్ధి అధికారి ఎన్‌టి.స్వామి తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నులిపురుగు నివారణ కార్యక్రమంపై శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్వామి మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన నిర్వహించే నులిపురుగు నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 19 ఏళ్ల లోపు విద్యార్థులకు డీవార్మింగ్ టాబ్లెట్స్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎం.శ్రీనివాస్, విద్యాశాఖాధికారి టి.రామ్మూర్తి, ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

## కన్వీనర్లు, గృహసారధులతో ఆత్మీయ సమావేశం

**భీమడోలు :** వైసిపి సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు పార్టీకి ప్రజలకు మధ్య అనుసంధానకర్తలుగా వ్యవహరించాలని ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు కోరారు. భీమడోలు కేంద్రంగా శుక్రవారం భీమడోలు, పొలసానిపల్లి, సూరప్పగూడెం, అంబరుపేట పంచాయతీలకు చెందిన పార్టీ సచివాలయ కన్వీనర్లు, గృహసారధులతో ఎంఎల్ఎ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీతో పార్టీ ఏర్పాటు చేసి 12 సంవత్సరాలు పూర్తి చేసుకొని 13వ సంవత్సరంలోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు గ్రామ, మండల స్థాయిలో పలు కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. స్థానిక సంస్థల ఎంఎల్‌సి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పార్టీ నాయకులు వంకా రవీంద్రనాథ్ మాట్లాడారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానీరంగా, సర్పంచులు సునీత మాన్‌సింగ్, రహీమా బేగం హసేన, భీమడోలు సొసైటీ అధ్యక్షులు రావిపాటి సత్య శ్రీనివాస్, ఎఎంసి ఛైర్మన్ ఇంజేటి నీలిమ, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ఎం.ఫణి పద్మజ పాల్గొన్నారు.

## విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులు పూర్తిస్థాయిలో అవగాహన పొందాలని పలువురు వక్తలు సూచించారు. స్థానిక చత్రపతి శివాజీ త్రి శతజయంతి కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం (పర్సనాలిటీ డెవలప్‌మెంట్) అంశంపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.పంకజ్‌కుమార్ వ్యవహరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు, ఆంగ్ల శాఖ అధ్యాపకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు, పి.సన్యాసిరావు, గణిత అధ్యాపకులు డాక్టర్ బదరి నారాయణ, రసాయన శాస్త్ర అధ్యాపకులు వెంకటాచార్యులు, తెలుగు అధ్యాపకులు వెంకటలాల్, ఎకనామిక్స్ అధ్యాపకులు హనుమంతరావు, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు శ్రీనివాసరావు, వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఉత్తమ్ సాగర్, రమాదేవి, జంతుశాస్త్ర అధ్యాపకులు విజయ దీపిక పాల్గొన్నారు.

## నేరాలు - ఘోరాలు

### ద్విచక్ర వాహనం పోయిందని ఫిర్యాదు

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

మండలంలోని దర్భగూడెం గ్రామంలో ఫిబ్రవరి 26న జరిగిన భూ లక్ష్మి అమ్మవారి జాతరలో తన ద్విచక్రవాహనం పోయిందని జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరానికి చెందిన పిల్లి మురళి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

# ఆ మలుపు.. ప్రమాదాలకు నెలవు..!

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

గొయ్యి పడి ప్రమాదకరంగా ఉన్న మలుపు ప్రాంతం

గుడ్లవల్లేరు రోడ్డు నుంచి ముదినేపల్లి సెంటర్ (వైకుడలి) రోడ్డు వైపు ప్రయాణించాలంటే ప్రయాణికులు, వాహనదారులు హడలెత్తిపోతున్నారు. రోడ్డు మలుపులో ప్రయివేట్ సంస్థలకు చెందిన కేబుల్‌లైన్ భూమి నుంచి వెళ్లింది. దీంతో ఆ ప్రాంతంలో ఐరన్ హోల్ ఏర్పాటు చేశారు. నిత్యం వేలాది వాహనాలు ఈ రోడ్డు గుండా ప్రయాణిస్తుంటాయి. ద్విచక్ర వాహనదారులు, లోడు లారీలు, స్కూల్ బస్సులు, ఆటోలు ఈ మలుపు నుంచి గుడివాడ, కైకలూరు రోడ్ల వైపు ప్రయాణిస్తుంటాయి. ఈ మలుపు తిరిగే సమయంలో వాహనాల టైర్లు ఐరన్‌హోల్ మూలకు తగిలి ద్విచక్ర వాహనాలు, లారీలు, స్కూల్ బస్సులు, ఆటోల టైర్లు పేలిపోతున్న సంఘటనలు నిత్యం చోటు చేసుకున్నాయి. టైర్లు పేలి పెద్దఎత్తున శబ్దం రావడంతో సమీపంలో ఉన్న వ్యాపారులు, ప్రయాణికులు, ప్రజలు భయందోళనలకు గురవుతున్నారు. పలుమార్లు టైర్ల కింద పడిన కంకరరాళ్లు ఎగిరి ప్రజలపై పడడంతో గాయాలపాలవుతున్నారు. ఐరన్‌హోల్ ఏర్పాటు చేసిన నాటి నుంచి ఇప్పటివరకు సూమారు 50కి పైగా వాహనాల టైర్లు పేలిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంత జరుగుతున్నా ఆర్అండ్‌బి అధికారులు కనీసం మరమ్మతులు చేపట్టలేదు.



ఐరన్ హోల్ ఇదే..

దీంతో ప్రయాణికులు, వాహనదారులు భయ పడుతూనే వెళ్తున్నారు. దీనికితోడు రోడ్డు మార్జిన్ కూడా అధ్వానంగా మా రింది. అధికారులు వెంటనే స్పందించి ఐరన్ హోల్ కనిపించకుండా రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఈ ప్రాంతవాసులు, వాహనదారులు, ప్రయాణికులు అధికారులను ముక్తకంఠంతో కోరుతున్నారు.

# యువకుడు ఆత్మహత్య

### ఇష్టం లేని పెళ్లే కారణమా..!

**దెందులూరు :** మరో 15 గంటల్లో ఆ యువకుడు పెళ్లి పీటల మీద కాబోయో భార్యకు తాళి కట్టాల్సిన ఆనంద క్షణాలు...పెళ్లికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ పెళ్లిపీటలు ఎక్కాల్సిన యువకుడు పాడె ఎక్కాల్సి వస్తుందని ఎవరూ ఊహించలేదు. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ విషాదకర ఘటన దెందులూరు మండలం కొవ్వలి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... కొవ్వలి గ్రామానికి చెందిన మన్నె రాము(23)కు శనివారం ముందుగానే నిశ్చయించుకున్న ప్రకారం వివాహం జరగాల్సి ఉంది. పెళ్లి జరగడానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులందరూ పెళ్లి పనుల్లో లీనమయ్యారు. ఎవరి పనుల్లో వారు ఉండగా ఇంతలోనే పిడుగులాంటి వార్త కుటుంబ సభ్యులకు చేరింది. రాము(పెళ్లి కొడుకు) ఉరేసుకున్నాడని తెలియటంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. వెంటనే రామును ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే రాము మృతి చెందాడు. రాము ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో ఆరా తీయగా తనకు ఈ పెళ్లి ఇష్టం లేదని, ఈ పెళ్లి చేసుకోనని ముందుగానే కుటుంబ సభ్యులకు తెలిపినట్లు సమాచారం. ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకునేందుకు దెందులూరు ఎస్ఐ ఇజ్జాపు వీర్రాజు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# గణపవరానికి రూ.60 లక్షలు మంజూరు

### తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు

**ప్రజాశక్తి - గణపవరం**

మండలంలో మంచినీటి సమస్య పరిష్కారానికి రూ.60 లక్షల నిధులు మంజూరు చేసినట్లు గణపవరం ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి తెలిపారు. మండలంలో వివిధ గ్రామాల్లో చెరువుల తీతలు, పైపులైన్లు, మైక్రోఫిల్టర్స్, శాండి ఫిల్టర్లు ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. కొమ్మరలో చెరువు పూడిక తీతకు రూ.ఆరు లక్షలు, ఎస్.కొండేపాడులో మైక్రో ఫిల్టర్స్ ఏర్పాటుకు రూ.లక్ష, గణపవరం బాలా చెరువు పూడికతీతకు రూ.20 లక్షలు, శాండి ఫిల్టర్లు ఏర్పాటుకు రూ.రెండు లక్షలు, ఎస్.కొండేపాడుకు రూ.రెండు లక్షలు, వల్లూరుకు రూ.2.50 లక్షలు, కొత్తపల్లికి రూ.రెండు లక్షలు, వీరేశపురానికి రూ.2.50 లక్షలు, వరదరాజపురంలో పైపులైను ఏర్పాటుకు రూ.లక్ష, వాకపల్లి చెరువు పూడికతీతకు రూ.ఆరు లక్షలు, పైపులైన్లకు రూ.1.50 లక్షలు, అప్పన్నపేటలో పైపులైన్ వేసేందుకు రూ.1.50, ఫిల్టర్ ఏర్పాటుకు రూ.రెండు లక్షలు, సిహెచ్ అగ్రహారానికి రూ.రెండు లక్షలు, డి.కుముదువల్లికి రూ.రెండు లక్షలు, వెంకట్రాజపురానికి రూ.రెండు లక్షలు, ట్యాంక్ నిర్మాణానికి రూ.రెండు లక్షలు, సిహెచ్.అగ్రహారానికి రూ.లక్ష, గణపవరం ఎస్‌సి పేట చెరువు పూడికతీతకు రూ.మూడు లక్షలు మొత్తం రూ.60 లక్షల నిధులు మంజూరైనట్లు ఎంపిడిఒ తెలిపారు. గ్రామ సర్పంచులు, కార్యదర్శులు వేసవిలో మంచినీటి కొరత రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. చెరువులను పూర్తిస్థాయిలో నీటితో నింపుకోవాలని సూచించారు. చెరువులో నీరు రంగు మారకుండా పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలన చేసుకోవాలని చెప్పారు.

# 'మానవత' సేవలు అభినందనీయం

**ప్రజాశక్తి - భీమడోలు**

మండలంలోని మారుమూల ప్రాంతమైన కురెళ్లగూడెం గ్రామంలో ఉచిత నేత్ర వైద్య పరీక్షా శిబిరం నిర్వహించేందుకు స్వచ్ఛంద సంస్థ మానవతా భీమడోలు శాఖ ముందుకు రావడం అభినందనీయమని గ్రామ సర్పంచి జి.నాగగౌతమి తెలిపారు. గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వేదికగా శుక్రవారం మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య పరీక్షా శిబిరం, ఉచిత రక్త గ్రూపు నిర్ధారణ పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. వైద్య సేవలను వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి వైద్యశాల వైద్యులు, సిబ్బంది అందించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మానవత సంస్థ జిల్లా అధ్యక్షులు రామిశెట్టి గంగాధరరావు మాట్లాడుతూ శిబిరంలో 150 మందికి నేత్రవైద్య పరీక్షలు, 130 మందికి రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు చేశామన్నారు. కంటి ఆపరేషన్లు అవసరమైన పది మందికి వేమగిరిలోని కంటి ఆసుపత్రిలో ఆపరేషన్లను ఉచితంగా చేస్తారన్నారు. 20 మందికి కళ్లజోళ్లు అందించామని తెలిపారు. గ్రామంలో నిర్వహించిన మరొక కార్యక్రమంలో ఇటీవల కాలంలో పూళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయిన ముగ్గురు వ్యక్తులకు చెందిన కుటుంబాలతో పాటు, గాయాల పాలైన మరొక వ్యక్తి కుటుంబానికి రూ.పదివేల విలువైన నిత్యావసర వస్తువులు, బియ్యం అందించామన్నారు. భీమడోలుకు చెందిన సాయిరాం క్లాత్ స్టోర్స్ యాజమాన్యం సదరు కుటుంబాల వారికి దుస్తులను అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవతా కేంద్ర కమిటీ సభ్యులు అప్పక రాంబాబు, భీమడోలు శాఖ ఛైర్మన్ గుళ్ల నూకరాజు, భీమడోలు శాఖ అధ్యక్షులు పచ్చా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కురెళ్లగూడెంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

# ప్రభుత్వ ఆసుపత్రిలోనే పురుడు పోసుకోవాలి

గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యులు

**ప్రజాశక్తి - గణపవరం**

గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలో పురుడు పోసుకోవాలని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు పి.సంతోష్‌నాయుడు, పి.కిరణ్మయి అన్నారు. స్థానిక పిహెచ్‌సిలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి పరిధిలోని 67 మంది గర్భిణులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ గర్భిణులు తప్పనిసరిగా నాలుగుసార్లు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకుని ఐరన్, కాల్షియం మాత్రలు వాడాలన్నారు. ప్రతి నెలా 9, 10 తేదీల్లో గర్భిణులకు ప్రత్యేక పరీక్షలు చేస్తామని చెప్పారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణుల, పిల్లల పేర్లు నమోదు చేస్తామని చెప్పారు. అనంతరం సరిపల్లిలో డ్రై డే నిర్వహించారు. వైవి.లక్ష్మణరావు స్థానికులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ జె.విల్సన్‌బాబు, ఆరోగ్య సహాయకులు గేదెల శ్రీనివాసు, అదపరెడ్డి కృష్ణ, ఎం.యోహాను, ఎఎన్ఎం వల్లి, ఎంఎల్‌హెచ్‌పి మౌనిక పాల్గొన్నారు

**సిహెచ్ అగ్రహారంలో డ్రైడే**

మండలంలోని సిహెచ్ అగ్రహారంలో శుక్రవారం పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆరోగ్య సహాయకులు నామాల రాజు మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు ఇంట్లోకి రాకుండా దోమతెరలు వాడాలని సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో మురికి నీరు లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి స్రవంతి, విఆర్ఒ మాధవి, ఎంఎల్‌హెచ్‌పి మాధురి ప్రకాష్, ఎఎన్ఎం ఏసమ్మ, ఆశా వర్కర్లు భవాని, పి.దుర్గ, వాలంటీర్లు గౌతమి, సాయి పాల్గొన్నారు.

## కుటుంబ నియంత్రణపై ముగిసిన శిక్షణ

**నూజివీడు :** నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందికి కుటుంబ నియంత్రణపై ఇచ్చిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్ మాట్లాడుతూ గడిచిన 14 రోజులుగా కుటుంబ నియంత్రణపై ప్రత్యేకమైన శిక్షణ అందించినట్లు తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ పర్యవేక్షణలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలకు సంబంధించి మెరుగైన వైద్య సేవలందించే దిశగా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సమీపంలోని గ్రామ ప్రజలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రత్యేక శిక్షణ పొందిన మెడికల్ సిబ్బంది, వైద్యులు గొల్లపల్లి పిహెచ్‌సిలో ఇకపై కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సమీపంలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## వ్యవసాయ శాఖ సహాయకులు అందుబాటులో ఉండాలి

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

మండలంలో పని చేస్తున్న వ్యవసాయ శాఖ సహాయకులు రైతులకు అందుబాటులో ఉండాలని కెఆర్.పురం వ్యవసాయ శాఖ సంచాలకులు ఎడి బుజ్జిబాబు సిబ్బందిని ఆదేశించారు. మండల వ్యవసాయధికారి కార్యాలయంలో సిబ్బందితో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. యాప్ పనితీరు గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ వ్యవసాయ సహాయకులు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని చెప్పారు. వ్యవసాయానికి సంబంధించిన ఏ సమస్య ఉన్నా రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బందికి తెలియపరచవచ్చని రైతులకు సూచించారు. సిబ్బంది విధుల్లో సక్రమంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కొర్స పోసమ్మ, వ్యవసాయ అధికారి కె.గంగాధర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన పర్వతనేని గంగాధర్

**ప్రజాశక్తి - చాట్రాయి**

మండలంలోని సూరంపాలెం గ్రామానికి చెందిన మోరంపూడి కృష్ణారావు, జ్యోతి దంపతుల కుమారుడు పృథ్వీరాజ్ వివాహ రిసెప్షన్ విస్సన్నపేట గ్రామంలోని కాకతీయ కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించగా టిడిపి నూజివీడు నియోజకవర్గ నాయకులు పర్వతనేని గంగాధర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవరెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు అక్కినేని చందు, మోరంపూడి శ్రీను, టిడిపి సీనియర్ నాయకులు నెక్కలపు వెంకటేశ్వరరావు, చలసాని వెంకటేశ్వరరావు, కర్నాటి చక్రవర్తి, మువ్వ పండు, తెలుగు యువత మండల అధ్యక్షులు బి.సతీష్, జక్కంపూడి ప్రదీప్, గంగాధర్ మిత్రులు కోనేరు హరీష్, జాలిపర్తి శోభన్‌బాబు, వినయ్, తుమ్మల రాఘవ పాల్గొన్నారు.

## జనసేన ఆవిర్భావ దినోత్సవ సభ జయప్రదానికి పిలుపు

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

మార్చి 14న మచిలీపట్నంలో జరుగే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభలో నియోజకవర్గం నుంచి జనసైనికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో నియోజకవర్గ పరిశీలకులు గడ్డమనుగు రవికుమార్ నివాసం వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ భారీ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ నాయకులు గడ్డమనుగు రవికుమార్, కన్వీనర్ పసుపులేటి రాము, చిన్ని అడపా నాగరాజు, తోట రవి, తెల్లం రవిప్రసాద్, ఆది నారాయణ వెంకన్న బాబు పాల్గొన్నారు.

**ఉంగుటూరు :** ఈ నెల 14వ తేదీన మచిలీపట్నంలో జరుగబోయే జనసేన పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఛైర్మన్ పత్సమట్ల ధర్మరాజు కోరారు. శుక్రవారం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ జనసేన ఆవిర్భావ సభ ఏర్పాట్లు భారీగా జరుగుతున్నాయని, జనసైనికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జనసేన ఆవిర్భావ సభ పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నిడమర్రు మండల అధ్యక్షులు నిమ్మల దొరబాబు, ఉంగుటూరు నియోజకవర్గ ఐటి వింగ్ కో-ఆర్డినేటర్ అయితం దుర్గాప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

**IN THE HON'BLE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM**
**I.P. 7/2022**
Between:
**Talasila Rohini Kumar** ...Petitioner
And:
**Y. Venkateswara Rao** & others ...Respondents
**NOTICE**
To,
**Respondent No.9:**
**Nalluri Lakshmi Narasimha**, S/o. Krishna, age 45 years, Farmer, R/at D.No.1-87, Moritappa, Dharborevu Post, Narsapur, West Godavari District-534275.
Please take notice that the above named petitioner has instituted the above I.P against the respondents and the matter stands posted to **15-03-2023** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **15-03-2023 at 10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence ex-parte as per law.
(By Order of the Hon'ble Court)
**YERRA REVATHI**, Advocate
Visakhapatnam. **Cell: 79893 44376**

## కాకతీయ డిగ్రీ కళాశాల పేరు మార్పు

**ప్రజాశక్తి - భీమడోలు**

భీమడోలు కేంద్రంగా పనిచేస్తున్న శ్రీ కాకతీయ డిగ్రీ కళాశాల పేరు మారింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి రత్న డిగ్రీ కళాశాలగా మార్చనున్నారు. దీనికి కరస్పాండెంట్, కార్యదర్శిగా కె.ప్రేమ్‌కుమార్ వ్యవహరించనున్నారు. శ్రీనివాసా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాకతీయ డిగ్రీ కళాశాల యాజమాన్యం ఇటీవల కాలంలో ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయానికి పేరు మార్పు కోసం దరఖాస్తు చేసుకున్నారు. విశ్వవిద్యాలయం వారు పరిశీలన అనంతరం వచ్చే విద్యా సంవత్సరం నుంచి కాకతీయ డిగ్రీ కళాశాలను రత్న డిగ్రీ కళాశాలగా మార్పు చేసేందుకు అనుమతించారని సదరు కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ తెలిపారు.

## పివి.సునీల్‌కుమార్‌ను కలిసిన నాయకులు

**ప్రజాశక్తి - ఉంగుటూరు**

రాష్ట్ర ఫైర్ సర్వీస్ డిజిపిగా నియమితులైన పివి.సునీల్‌కుమార్‌ను అమరావతిలోని ఆయన కార్యాలయంలో ఉంగుటూరు మండల అంబేద్కర్ మిషన్ సంస్థ నాయకులు శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. ఆయనను కలిసినవారిలో చోడే అనిల్, మహేష్, గంటా వెంకట్, గంటా సుబ్బారావు, సురేష్, సునీల్ ఉన్నారు.

## 18న ప్రత్యేక లోక్ అదాలత్

**ప్రజాశక్తి - ఏలూరు**

ఈ నెల 18వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవ సదనంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏలూరు, నరసాపురంలో ఉన్న వినియోగదారుల ఫారం సంబంధించిన కేసులను రాజీ చేయనున్నట్లు తెలిపారు.

## నేడు ఉచిత వైద్య శిబరం

**ప్రజాశక్తి - ముసునూరు**

సాయిస్ఫూర్తి హాస్పిటల్ వారితో మండలంలోని చెక్కపల్లి కూచిపూడి లక్ష్మీనారాయణ కమ్యూనిటీ హాలు వద్ద శనివారం ఉచిత వైద్య శిబరం నిర్వహించనునట్లు టిడిపి మండల నాయకులు కూచిపూడి దేవేంద్ర తెలిపారు. చింతలపూడి సాయిస్ఫూర్తి హాస్పిటల్ వైద్యులు ఆర్.భవ్య, డాక్టర్ పి.రవీంద్రబాబు, డాక్టర్ పి.మణికంఠ, డాక్టర్ బి.సూర్య, డాక్టర్ మురళీకృష్ణ వైద్య సేవలందించనున్నట్లు తెలిపారు.

## తల్లిని కోల్పోయిన పిల్లలకు ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - ఏలూరు టౌన్**

ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రు గ్రామానికి చెందిన సైదు ఏడుకొండలు కుటుంబానికి కొల్లేరు ప్రాంత నాయకుడు సైదు గోవర్ధన్ అండగా నిలిచారు. ఏడుకొండలు భార్య దుర్గమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ క్రమంలో ఏడుకొండలు కుటుంబాన్ని గోవర్ధన్ శుక్రవారం పరామర్శించి రూ.పది వేల ఆర్థిక సాయం అందించారు. ఏడుకొండలు కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## 17 నుంచి నూకాలమ్మ జాతర

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

స్థానిక బుట్టాయగూడెం రోడ్డులో నూకాలమ్మ 59వ ఉగాది వార్షిక జాతరను ఈ నెల 17 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం జాతర మహోత్సవ కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెఎల్ఎన్ ధనకుమార్, పలువురు మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**డాక్యుమెంట్ పడిపోయినది**
మామిడిపల్లి వి.యస్.ఆర్.కె.యస్.వి. ప్రసాద్, తండ్రి: సత్యనారాయణ అను నాయొక్క దస్తావేజు పడిపోయినది. ఇంటి నుండి తణుకు జిరాక్స్ సెంటర్‌కు వెళుతుండగ నాయొక్క దస్తావేజు కనిపించలేదు. దస్తావేజు నెం: 20g Book No. 4/2005 గల దస్తావేజు పడిపోయినది. ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.
**మామిడిపల్లి**
**వి.యస్.ఆర్.కె.యస్.వి.ప్రసాద్**
**తండ్రి: సత్యనారాయణ, డోర్ నెం: 1-17, పైడిపర్రు, తణుకు మండలం, ప॥గో॥జిల్లా, పిన్ : 534211. సెల్: 99668 63685**

**IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE, ELURU**
**E.P.10/2019, O.S.55/2013**
Between:
వేల్పుల వెంకటేశ్వరరావు ...D.Hr
And
దేవు నాగరాజు, S/o.రామారావు, విద్యుత్ నగర్ కాలనీ, వట్లూరు, పెదపాడు మండలం. ...J.Dr
**వేలము నోటీసు**
పై నంబరు దావా గ్రంథములోని D.Hr తన బాకీని వసూలు చేసుకునే నిమిత్తం దాఖలు చేసిన ఈ E.P గ్రంథములో దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని **ది.27-03-2023 తేదీన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టు వారి ఎదుట బహిరంగముగా వేలం వేయ బడును.** వేలంలో పాడుకొనదలచిన వారు ఉదయం 10.30 గం.లకు ఆధార్ కార్డులతో వచ్చి వేలంలో పాల్గొనదలచినదిగా కోర్టు వారు ఆర్డరు వేసియున్నారు.
***షెడ్యూలు:*** Landed property in an extent of Ac.0-10 cts covered by R.S.No.114/3 situated in kolaparru Grama panchayat, pedapadu mandalam, Eluru SRO, W.G.Dt., within the following boundaries.
**EAST:** Land of Kadaganchi Lakshmi
**SOUTH:** Land of Balda Manikyamma
**WEST:** Land of Ramini China Venkateswara Rao, **NORTH:** Land of Vare Veera Swamy.
An extent of Ac.0-10 cts of land, with all the easementary rights.
***D.Hr Value - more than five lakhs***
***Amin Value - Rs.2,33,000/-***
Eluru Dt.10-03-2023
**S.BRAHMAM,** Advocate, Eluru. Cell: 94929 32214